# ఆక్రందన

ముంబయిలో సామాన్యులకు చోటు లేదా? ఎన్నో రోజులుగా భూమేశ్‌ను తొలుస్తున్న ప్రశ్న. గత రెండు సంవత్సరాల్లో ముంబయిలో అమ్మబడ్డ భూముల ధరలు కళ్ళముందు కదలాడాయి. తన తండ్రి పని చేసిన ముంబై టెక్స్‌టైల్ మిల్లు, కోహినూర్ మిల్లు, నం. 3, అపోలో మిల్లు, జూపిటర్ మిల్లు, ఎల్‌పిన్‌స్టన్ మిల్లు, న్యూ హింద్ మిల్లు, ఇండియా యునైటెడ్ మిల్లు వీటికి చెందిన అరవై ఎకరాలు, రెండువేల నాలుగు వందల కోట్లకు అమ్ముడయ్యాయి. అంటే సగటున ఎకరానికి నలభైకోట్లు! తాను పెట్టిపెరిగిన చోటు ఇప్పుడు కోట్లు పలుకుతోంది కాని తానేమో ముంబయి శివార్ల చివరకు విసిరివేయబడ్డాడు. తమ రక్తమాంసాలు కరిగించి జీవితం ధారపోసిన వారికి ఉండే చోటు లేదు!

తన తండ్రి ముప్ఫై ఏళ్ళు పని చేసిన బట్టల మిల్లు నష్టాల్లో కూరుకుపోయి చివరకు మూతబడింది. దానిని చేపట్టిన ప్రభుత్వ సంస్థ, నేషనల్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ కూడా మిల్లును లాభాల బాటన నడిపించడంలో విఫలమైంది. కాని ఇప్పుడు? ఆ సంస్థ పంట పడింది. మిల్లును నడిపి, కార్మికులు ఉపాధి కోల్పోకుండా చేయడం

చేతగాని ఆ సంస్థ, మిల్లు భూములమ్మి, కొన్ని వేల కోట్ల లాభం ఆర్జిస్తోంది. మిల్లు మూతపడడంతో ఉద్యోగాలు కోల్పోయిన వారికి నష్టాల నెపంతో తగు నష్టపరిహారం ఇవ్వకుండా ఇంటికి తరిమేసిన సంస్థ, ఇప్పుడు లాభాలను మాత్రం తన ఖాతాలో జమ చేసుకుంటోంది. న్యాయపరంగా ఆలోచిస్తే ఆ లాభాల్లో కార్మికులకు ఇంకా మిగిలి ఉన్న మిల్లు భూముల్లో ఇళ్లు కట్టి ఇవ్వొచ్చు. కాని దానికి పాటుపడే నాధుడేడీ? భూమేశ్ కుతకుతలాడిపోతున్నాడు. కానీ అతను అసహాయుడు. అతనికెవరూ అండలేరు. తండ్రితో పనిచేసిన వారంతా చెట్టుకొకకరు, పుట్టకొకరుగా చెల్లాచెదురై పోయారు. కుటుంబ బాధ్యతల వల్ల వీడలేని ఉద్యోగం. ఒంటరిపోరాటం చేయలేడు. ఖర్మని నిందించడమొక్కటే అతనిప్పుడు చేయగలిగింది! భూమేశ్ గతం అతని కళ్ళ ముందు నిలిచింది.

తన తండ్రి పనిచేసే మిల్లు మూతపడినప్పుడు తన ఇంటరు పరీక్షలు పూర్తయ్యాయి. ఫలితాలు తెలిశాయి. మంచి మార్కులు వచ్చినా, మెడిసిన్, ఇంజనీరింగులో సీటు వచ్చే అవకాశం ఉన్నా, కామర్సులో చేరవలసి వచ్చింది. కాలేజీలో చదువుతూ ఉద్యోగ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. పోటీ పరీక్షల్లో నెగ్గి, ఓ ప్రభుత్వ సంస్థలో క్లర్కుగా చేరాడు. అయిదేళ్ళలో కుటుంబ వ్యవహారాలు ఓ కొలిక్కి వచ్చాయి. చెల్లి పెళ్ళి అయ్యింది. తమ్ముడు ఇంజనీరింగ్‌లో చేరాడు. ఆ తర్వాత తన పెళ్ళైంది. జీవిత నావ ఒడ్డున చేరిందనుకునేంతలో మరో పిడుగు పడింది. లోయర్ పరేల్‌లో తామున్న గది ఖాళీ చేయమని నోటీసు! బిల్డింగు మరీ పాతబడిందనీ, ఎప్పుడు కూలుతుందో చెప్పలేమనీ, అందుకని నెలలోగా ఖాళీ చేయాలని రిపేరు బోర్డు నుండి ఉత్తర్వులు అందాయి. అప్పటికప్పుడు ఎక్కడికని వెళ్లేది? ఎవరో పరిచయస్తుల ద్వారా ముప్ఫై కిలోమీటర్ల దూరం దహిసర్‌లో తమకు అందుబాటు అద్దెలో రెండు గదుల పోర్షను కుదిరింది. అక్కడి నుండి చర్చిగేటులోని ఆఫీసుకుపోయి రావడానికి ప్రయాణంలోనే నాలుగు గంటలు ఖర్చయ్యేవి. భూమేశ్ ఉదయం ఏడు గంటలకు ఇల్లు వదిలితే తిరిగి వచ్చేది రాత్రి తొమ్మిది తర్వాతే.

భూమేశ్ దంపతులకు ఇద్దరు పిల్లలు కలిగారు. ఆ అద్దె ఇంట్లో కుటుంబం ఇమడడం కష్టమైంది. బ్యాంకు లోనుతో విరార్‌లో మూడు గదుల ఫ్లాటు తీసుకున్నాడు. ఇప్పుడు ఆఫీసు మరీ దూరమైంది. రానూ, పోనూ నూటనలభై కిలోమీటర్లు ఆరు గంటల ప్రయాణం! గానుగెద్దు బతుకైంది. జీవితంలో ఇక అనుభూతులకు సమయమేది ?

"నాన్నా అన్న కొట్టాడు" కూతురు మాటలతో వర్తమానంలోకి వచ్చాడు భూమేశ్. పిల్లలను దగ్గరకు తీసుకుని వారి మధ్య సయోధ్య కుదిర్చాడు.

ఆలోచనల తుట్టె మళ్ళీ కదిలింది.

ముంబయి నడిబొడ్డులోని తమ పగిడీ ఇల్లు రిపేరు ఇంకా పూర్తికాలేదు. వందల కోట్లు విలువ వున్న ఆ భవన భూమిని అమ్మడానికి ఓ బిల్డరుతో ఒప్పందం కుదుర్చుకున్నాడు ఓనరు. ఆ ఒప్పందం చెల్లదని రిపేరు బోర్డు తేల్చడంతో ఓనరు కోర్టుకెక్కాడు. రిపేరు పని ఆపేశారు. కేసు వాయిదాలు పడుతూనే ఉన్నాయి. ఈలోగా తమ బాడుగ హక్కు వదిలివేయాలని ఓనరు తరపు గూండాలు తన తండ్రిపైన ఒత్తిడి తెస్తున్నారు. ఎంతో కొంత సొమ్ము తీసుకుని రాజీ కుదుర్చుకొమ్మని తండ్రికి తోటివారి ఉచిత సలహాలు. ఈ పరిస్థితుల్లో తమ పాత ఇంటికి తిరిగి వెళతామనే ఆశ, ఆశగానే ఉండేట్టుంది. ముంబయి మునిసిపల్ పరిధిలో మూడు గదుల ఇల్లు ధర పాతిక లక్షలు! ఇప్పుడు తమ పాత ఇంటి పరిసరాల్లోనైతే చదరపు అడుగు ధర పాతికవేల రూపాయలు! ముంబయిలో సామాన్యులకు చోటులేదా? భూమేశ్ మనసు మళ్ళీ ఆక్రోశించింది. ఈ భూ బకాసురుల లోకంలో అతని ఆక్రందన అరణ్య రోదనే!

నేటి నిజం గణతంత్ర్యదినోత్సవ ప్రత్యేక అనుబంధం

**2007**